శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సంపూర్ణగ్రంథావళి

# శృంగారామరుకావ్యము


అనువాదకర్త

తాళ్ళపాక తిరువేంగళప్ప

**పరిష్కర్త**

**శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి**



**ప్రచురణ**

**శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2013**


**SRUNGARAMARUKAVYAMU**

**By Tallapaka Tiruvengalappa**


**T.T.D. Religious Publications Series No.**



**© All Rights Reserved**



**2013**

**Copies : 1000**

**Price.Rs...............**

**Published by**

**Sri M.G. Gopal., I.A.S.,**
**Executive Officer,**
**Tirumala Tirupati Devasthanams,**
**Tirupati -517 501**

**D.T.P. SVPSVP., T.T.D. Tirupati.**

**Printed at**
**Tirumala Tirupati Devasthanams, Press.**
**Tirupati.**

*ఓం నమో వేంకటేశాయ*

# ముందుమాట

**యమ్.జి.గోపాల్ ఐ.ఏ.ఎస్.**
కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు,
తిరుపతి.

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రజల్లో ధార్మిక చింతనను కలిగించడంతో పాటు ధార్మిక సాహిత్యాన్ని ముద్రించి విశేషంగా ప్రచారం చేస్తున్నది. తిరుమలలో వెలసిన అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ వేంకటేశ్వరస్వామిపై భక్తిభావనతో రచనలు చేసినవారెందరో ఉన్నారు. వారిలో అన్నమయ్య ప్రప్రథముడు. అన్నమయ్య రచించిన తాళపత్రగ్రంథాలనేగాక ప్రాచీనకవుల తాళపత్రగ్రంథాలను కూడా సేకరించి పరిశీలించి, పరిష్కరించి అచ్చువేసిన పరిశోధకులలో అగ్రగణ్యులు శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు.

కీ.శే. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు క్రీ.శ. 1888 ఫిబ్రవరి 7వ తేదీన కృష్ణాజిల్లా పెదకళ్లేపల్లిలో శేషమ్మ, సుందరశాస్త్రి అనే పుణ్యదంపతులకు జన్మించారు. సంస్కృతాంధ్రభాషలో విశేషపాండిత్యాన్ని సంపాదించిన శాస్త్రిగారు మద్రాసులో కొంతకాలం తెలుగుపండితునిగా పనిచేశారు. తర్వాత మద్రాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారంలో పరిశోధక పండితునిగా పనిచేసి అనేక గ్రంథాలను వెలుగులోనికి తెచ్చారు. ఉత్తమ పరిశోధన గ్రంథాలను పరిష్కరించి ముద్రించారు. తిరుపతిలోని తి.తి.దే ఓరియంటల్ కళాశాలలో ఆచార్యులుగా పనిచేస్తూ తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనల రాగిరేకులను పరిష్కరించి వెలుగులోనికి తెచ్చారు. ఎంతోమంది శిష్యులను ఉద్దండపండితులుగా తీర్చిదిద్దారు.

యోగివర్యులు, ఉత్తమపరిశోధకులు, బహుముఖప్రజ్ఞాశాలి, కవి, ఆత్మదర్శనులైన శ్రీ శాస్త్రిగారి సాహిత్యసేవను గుర్తించి తి.తి.దేవస్థానంవారు 2007వ సం॥లో శ్వేతభవనంలో "శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠాన్ని" స్థాపించారు. ఈ పీఠం స్థాపించిన నాటినుండి వారు పరిష్కరించి రచించిన గ్రంథాలను ముద్రించి ఆంధ్రసాహితీ లోకాని కందించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం., శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే ఇప్పటికి సుమారు పది గ్రంథాలకుపైగా ముద్రించింది. ఈ వరుస క్రమంలో వచ్చిందే **"శృంగారామరు కావ్యము"** అనే గ్రంథం. ఈ గ్రంథాన్ని తెలుగు సాహిత్యాభిమానులందరు తప్పక ఆదరించి పఠించగలరని ఆశిస్తున్నాము.

**(యమ్.జి.గోపాల్ )**

## ఆంధ్రామరుకము.

సంస్కృతమున అమరుశతకము శ్రీమచ్ఛంకరపూజ్యపాదులు పరకాయ ప్రవేశము చేసి శృంగారానుభూతులఁదేలుచు రచించినదని కొన్ని గ్రంథములు వాకొనుచున్నవి. కాని, యవి యప్రామాణికములే యని ప్రాజ్ఞులచే నవగణింపఁబడినవి. అమరుశతకకర్త అమరుఁడనీ, అమరుకుఁడనీ పేరుగల యొకానొకరాజు గాఁదగునందురు. ఈ శతకశ్లోకములు నూఱును నేర్పరి యగు చిత్రకారుఁడు చదివినచో నూఱుచిత్రములు చిత్రింపఁగలఁడు.

"అమరుక కవే రేకఃశ్లోకః ప్రబంధశతాయతే" అని ప్రాచీనుల ప్రస్తుతి. అలంకారశాస్త్రకారులీశతకపు శ్లోకములను ధ్వనిప్రభేదాదులకు లక్ష్యములనుగాఁబదింబదిగా నుదాహరించిరి.

దీనికిఁదెలుఁగున సరిగా లెక్క పెట్టఁగాక యెన్నో పరివర్తనములు వెలసినవి. కొన్ని ప్రాచీనములు, కొన్ని నవీనములు. కొన్ని రచయితల దగ్గఱనే దాగియున్నవి. ఉన్న వానిలోనికెల్ల నీ పరివర్తనమే ప్రాచీనతమమనుకొందును. దీని కర్త తాళ్లపాక తిరువేంగళప్ప. ఈతఁడన్నమాచార్యుని మనుమఁడగు చిన తిమ్మదీక్షితుని కుమారుఁడు. తిరుమల, తిరువేంకటేశ, వేంకటేశ్వర దీక్షిత పదము లొక్కనిపేర్లు కావచ్చును. చినతిమ్మదీక్షితునికొడుకు తిరువేంగళప్ప కావ్యప్రకాశవ్యాఖ్యను, నామలింగానుశాసన వ్యాఖ్యను గూడ రచించినాఁడు. ఈ శతకమునకుఁగూడ నీ తిరువేంగళప్ప రచయిత కావచ్చునని నాకుఁ బూర్వము తాళ్లపాకరచనల ముద్రాపకులు తలఁచిరి.

పెదకోమటి వేమారెడ్డిగారి శృంగారదీపికా వ్యాఖ్యను, వేంకటరాయ శాస్త్రిగారి ముద్రణమును ననుసరించి శ్లోకములసంఖ్య యిందు చేర్పఁబడినది. ఈ తెల్గుకవి శ్లోకములకు విషయవిభాగముచేసి యొక క్రమమేర్పఱిచినాఁడు. కోమటి వేమారెడ్డిగారి శృంగార దీపికా వ్యాఖ్యాశ్లోక క్రమము వేఱు, ఈ కవి పద్యక్రమము వేఱు. శృంగార దీపికా వ్యాఖ్య గల శ్లోకముల కిందు తెలుఁగు పద్యములు గొన్ని గానరాలేదు.

(1,2, 30, 39, 48, 50, 77, 78, 84, 88, 94,. వీనికిఁ దెలుఁగు లేదు)

77వ పద్యమునకు మూలశ్లోకము రెడ్డిగారి గ్రంథమున లేదు. శృంగార దీపికావ్యాఖ్య 101 శ్లోకములకున్నది. ఇందవి 90 మాత్రమే కలవు.

శృంగార దీపికావ్యాఖ్యాక్రమమును నీ తెల్గు పద్యముల క్రమమును బ్రదర్శించు శ్లోకపద్యసంఖ్యాక్రమపట్టికను పాఠకుల సౌకర్యముకై యిందుఁ జేర్చితిని.

నేను బరిశీలించినంతలో సంస్కృతశ్లోకముల యావదర్థభావములు సరిగా గోచరించునట్లు సలిపిన తెల్గుసేఁతలు తక్కువ. కొన్ని రచనలలో కొన్ని కొన్ని పద్యములు మూలానుగుణముగాఁ జాలఁజక్కఁగా నున్నవి. అట్టి తెల్గుసేఁతలలో నిదియు నొకటి. తాళ్లపాక వారిది యని; ప్రాచీనము, రసహృద్యము నని; దీనిని బ్రకటించితిమి. మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలకు ముప్పదేండ్లకు ముందు నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాలెమున అద్దంకి యింటిపేరి వైష్ణవాచార్యుల యింట నుండి దీనిని నేను సేకరించితిని. ఆ యేకప్రతిని జూచి మదీయులు చి॥ తి. కోదండరామయ్యగారు శక్యమయిన సంస్కారములు జరపి ప్రతి వ్రాసియిచ్చిరి. ఈ ముద్రణములో పాఠలోపములు తప్పు పాఠములు చాల మూలమును జూచి నేను సవరించితిని.

వేటూరి ప్రభాకరశాస్త్రి.

# శృంగారామరుకావ్యము

## తాళ్లపాక – తిరువెంగళప్ప

ఉ. శ్రీ రుచిరాంగనాశ్రయవిచిత్రవిభూషణ సూనచందనో
దారవిలాసదీపితమునై యసితోత్పలకాంతి మించి శృం
గారరసంబు దోఁచె నసఁ గన్నులపండువ యైన మేనియొ
య్యారముఁ జూపు వేంకటనగాధిపుఁడీవుత మాకుఁగోరికల్

**1**

శృంగారరసప్రధాన మమరుక కావ్యము. శృంగారము– సంభోగము, విప్రలంభము నని రెండు విధములు. అందులో సంభోగశృంగారము మొదలుగా నుద్యోగించి శృంగారరసానకు ఆలంబనవిభావమైన నాయికా స్వరూపమునే దేవతగా భావించి తృతీయ పురుషార్థమును గూర్చి (కవి) ఆశీర్వచిస్తున్నాఁడు.

చ॥ చెదరి చలించుముంగురులు స్వేదకణంబుల నింత జాఱు బొ
ట్టొదవురతాంతతాంతమయి యొయ్యన సోలెడుకన్నుఁ దామరల్
కదలెడుకుండలంబులును గల్గిన పౌరుషభాసమాన యౌ
ముదితముఖారవింద మతిమోదము మీకు నొసంగుఁ గావుతన్

**2**

ప్రియాధరపానము అమృతపానమునకంటె ఉత్కృష్టమైనదని ఉపమానానికై (ముత్య?) మధ్యరూపప్రతీపాలంకారముచేత ప్రతిపాదించుట.

చ॥ పలుమొన మోవి నొక్క భయభావనఁజేవిదలించి కిన్క బొ
మ్మలు ముడివెట్టుచున్ శఠుఁడ! మానుము మానుమటంచు సీత్కృతుల్
పులకలు మించఁ జూచు విరిబోఁడిని ముద్దుకొన్న వారికిన్
గలిగె సుధానుభూతి, వృథగా విబుధు ల్మథియించి రంబుధిన్

**3**

రాత్రి నివృత్తోద్వృత్తసురతవార్తానువాది శుకనివారణ నాయికా చాతుర్యము.

చ॥ చెలువుఁడుఁ దాను, మన్మథవశీకృతులై తమ రాతి రన్న ప
ల్కులు మఱునాఁడు నెల్లజనులున్ వినఁ బల్కెడు చిల్కఁ జూచి, సి
గ్గొలయఁగఁ గాంత, కమ్మఁ దళుకొత్తెడు కెం పటు దీసి, దాడిమీ
ఫలమునె [1](పానఁజంచుపుట?) పాళి నమర్చుచు నిల్పెఁ బల్కులన్ 15

## 4

అత్యనురక్తులైన నాయికానాయకుల సంభోగశృంగారము.

చ॥ ఋతుమతి యౌటఁ, బాన్పునకు నింతయు దవ్వల నిల్చి, కాంతుఁడం
చితరదనచ్ఛదస్ఫురణచే బొమసన్నల ముద్దు వేఁడఁగా,
స్మితవికసత్కపోలములఁ జెన్నగు మో మటు గప్పి కొంగుచే
సతి తల యూఁచె నొయ్యన లసన్మణికుండలముల్ చలింపఁగన్ 67

## 5

బహునాయికా మనోరంజనచతురుండగు దక్షిణనాయకుని చేష్టితము.

చ॥ ప్రియతమ లిద్దఱొక్క మణిపీఠిక నుండఁగ, వెన్క నేఁగుదెం
చి యొకతె కన్నులన్ నగవుచేబలె మూయుచు, మోముఁ ద్రిప్పి వే
ఱ యొకతె చెక్కులన్ బులకరాజియు లేనగవుం జెలంగఁగా
దయితుఁడు ముద్దువెట్టుకొనె, దక్షిణభావము బోంట్లు మెచ్చఁగన్ 18

## 6

ప్రణయరోషార్థమై చెలికత్తెలు బోధింపగాను కపటకోపమును నటించే నాయిక యొక్క నాయకవశ్యత్వము.

చ॥ బిసరుహనేత్ర, యేమిటికి బిగ్గ ముసుంగిడి నిద్రవోయెడిన్
గిసలయపాణి! యంచుఁ బతి కేవలమున్ జెలిఁ బల్క లేని యా
రసమున నమ్మ! నిద్దురకు రాయిడిసేసె నటంచు నోరయై
పొసఁగఁగ నిద్రవోవుగతిఁ బొల్తుక దా నెడయిచ్చెఁ బాన్పునన్ 20

1. నెపంబు……పాళి,



## 7

ముగ్ధనాయికా లజ్జాకులభావము.

ఉ॥ కాంతుఁడు కొంగుఁదీయ, నొడికంబున మో మరవంచె బల్మిచే,
నంతటఁ గౌఁగిలించుసమయంబున నెమ్మెయి యోరఁజేయుచున్,
జెంతల నవ్వునెచ్చెలులఁ జెల్వుని మానుపుఁ డంచుఁ బల్కలే
కెంతయుఁగ్లాంతిఁజెందెఁ, [1]దరళేక్షణ సిగ్గున నూత్నసంగతిన్ 36

## 8

పూర్వము మౌగ్ధ్యముచేత నాయకునితో స్వేచ్ఛావిహారము లేక కాలము గతించె నని ప్రౌఢిమచేత స్వైరవిహారసౌఖ్యము ననుభవించే నాయిక పశ్చాత్తాపము.

చ॥ ప్రియుఁడు కవుంగిలించునెడ బిగ్గిలఁ జేర్పక, ముద్దుఁబెట్ట నిం
తయు మొగ మెత్త, కాతఁడు గనం దివురం గనుఁగోక, పల్కుచో
నయినను బల్క, కే ముగుదనై మును వంచిత నైతి నంచుఁ బ్రే
మ యెసఁగుటన్ రసజ్ఞయయి మానిని చెందెఁగృశానుతాపమున్ 51

## 9

నాయకుడు తన సురతోత్కంఠాతిశయమును సరసచేష్టావ్యాజమున బ్రకటముసేయగాను, చెలికత్తెలా కీలెఱింగి నేర్పున నవ్వలికిబోయే వృత్తాంతము.

చ॥ అలరుపసిండి వంటి తనుయష్టికి నీ ఱవికేల మాటుగా
జలజదళాక్షి! యంచుఁ బతిసయ్యనఁగ్రొమ్ముడి గేల నంటఁగాఁ
దలిమముచెంత నున్న సఖి తమ్ములు నవ్వు చెలంగఁజూచినన్
జెలులును మెల్లనే నెపము సెప్పుచు వాకిటి కేఁగి రందఱున్ 25

1. గోఁకిచూపెఁ

## 10

గురుసన్నిధియందు నత్యంతాసక్తులయిన నాయికానాయకుల యలుకతో గూడిన శృంగారము.

ఉ॥ రాగమయాపగారయభరంబునఁ గాముకు లట్లు డాసి తా
మా గురుసేతుబంధమున నాఁకకు లోనయి కాఁకదీఱమిన్
బాగుగ వ్రాసిన ట్లవశభావము నొందఁగ మేను లంగ సం
యోగరసంబు నానిరి దృగుజ్జ్వలసారసనాళసంగతిన్ 60

## 11

ముగ్ధానాయికాలబ్ధసంభోగశృంగారము.

చ॥ విలసనమందిరం బతి వివిక్తముగాఁగని, సెజ్జనుండి ని
శ్చలగతి నింత లేవక యసత్యపు నిద్దురవోవఁ, గాంతు మో
మలవడఁ జూచి, ముగ్ధ తమియారఁగ ముద్దిడుకొంచుఁ జెక్కులం
బులకలు గాంచి, సిగ్గుపడ ముద్దిడెఁ, గాంతుఁడు దాను నవ్వుచున్ 74

## 12

నవోఢానాయికాలజ్జా చేష్టితము.

చ॥ చెలువుఁడు కేళికాంతమునఁ జేల మొసంగమిఁ బాదలగ్నమే
ఖలయయి పోనరాక, కరకంజవిధూననచేతఁ గేళికా
గళిత లతాంతపాతమునఁ గ్రక్కున నత్తఱి దీపమాఱమిన్
గలికి విలోకనేచ్ఛుఁడగు కాంతుని కన్నులు మూసె నవ్వుచున్ 89

## 13

నాయిక విరహోక్షమత్వ రూపౌత్సుక్యము.

ఉ॥ కామిని యల్క నవ్వలిమొగంబయి కైతవనిద్రఁ జెందఁగాఁ,
గాముకుఁ డంగభేద మెఱుఁగంబడకుండఁగఁ గౌఁగిలించి వే
దామరఁ ద్రాసభారచలితంబుగ నీవిక యంట, నా వధూ
టీమణి యానుకూల్యము ఘటించె, వలగ్నము నక్కళింపుచున్ 90



## 14

నాయికా కాలాక్షమత్వ రూపౌత్సుక్యము.

ఉ॥ అంగన దూరదేశగతుఁడౌ పతి బవలెల్లఁ గోర్కి చే
తం గడుఁ దేరఁజేసి, రతిధామముఁ జేరి, సఖీమణుల్ కథా
సంగతిఁ బ్రొద్దుపుచ్చ, [1]నెదొ చట్టనఁ గుట్టె నటంచుఁ బల్కుచుం
గొంగు విదల్చి కేళిపయిఁ గోరికఁ దీపముఁ ద్రెంచె, నేర్పునన్ 86

## 15

ధూర్తనాయకునిచేత వంచితయైన ఖండితనాయికావ్యాపారము.

ఉ॥ వాతెఱ వింతగం ట్లలర వచ్చుపతిన్, సతి కేళికాసరో
జాతముచేత వ్రేయఁగ రజంబిదె రాలె నటంచు, మూసికో
నాతఁడు కన్గవన్, భ్రమసి యంగన పూత్కృతు లందు నించగా
నీ తఱి ముద్దు పెట్టుకొనియెన్ సతి నొక్కతె ధూర్తు నేర్పునన్ 80

## 16

వాసకసజ్జిక పరిణామాలంకారరూపమున నాయికా సౌందర్య వర్ణనము.

చ॥ చెలువుఁడు వచ్చువేళ, సరసీరుహలోచన మంగళార్థమై
కలువలఁ గాదు, తోరణముఁ గట్టుట వాలికచూపుదండనే
యలరులఁ గాదు, మించు నుపహారము నవ్వునఁ గాని, యర్ఘ్యముల్
కలశగతాంబుపూరమునఁ గాదు చెమర్చు నురోజపాళినే 40

## 17

ముగ్ధా నాయికాసఖీ జనోపదిష్టేర్ష్యాపూర్వక సంభోగశృంగారము.

చ॥ చెలి యపరాధియైన పతిచెంగట వ్యంగ్యములెన్ని యాడు మం
చలవడఁ బల్కి రన్నియు రయంబునఁ బల్కి మనోజునాజ్ఞలో
మెలఁగఁగఁ జొచ్చె నంత సతి మిక్కిలి గోలతనంబు సొమ్ముగాఁ
గల యనురాగపున్ సతినిఁ గాంతుఁడు సెజ్జకుఁ దార్చె నత్తఱిన్ 43

---

1.నదె చంద్రుఁడుదూఱె

## 18

ఏక శయ్యావిరహపూర్వక శృంగారము.

చ॥ ప్రియుఁ డొక సెజ్జపై సవతిఁ బేర్కొన, ముద్దియ వేగఁ గోపగిం
చి యతఁడు వేఁడుకొన్న మఱి చేకొన కవ్వలిమోము సేయ, నా
దయితుఁడు నూరకున్న, గడుఁ దత్తరమందుచు మోముఁ ద్రిప్పికాం
తయుఁ బతి నిద్రవోవఁడు గదా,యని యప్పుడ చూచె వెండియున్ 23

## 19

సురతాంతమందుఁ బూర్వాకృష్టమైన వస్త్రము నీయకుండగాను కరుణాలాపములచేత వేడుకొను నాయికఁ జూచి పునారతోద్యుక్తుఁడయిన నాయకుని యందు బలాత్కారముచేత వస్త్రాపకర్షణ చేసిన చోరవృత్తాంతమున్నూ మన్మథుని యందు తన్నివారకుడైన రాజవృత్తాంతమున్ను తోచేటట్లు కవి వర్ణిస్తున్నాడు.

ఉ॥ కంతు రణావసానమునఁ గాంతుఁడు చేలము దాఁచి యీయకే
యెంతయు జాగు సేయఁ, జపలేక్షణ యాడెడు దీనవాక్యముల్
కంతుఁడు వించు మేటివిలుకాఁ డగుటన్ జలమూని, తా సమీ
కాంతరముక్త సన్నహనుఁ డయ్యును బూనెఁ బునారణోద్ధతిన్ 100

## 20,21

ఏక శయ్యా విరహపూర్వక మైన సంభోగశృంగారము.

చ॥ ఒక తలిమంబునం బలుక నొల్లక మాఱుమొగంబు వెట్టి, ప్రే
మ కతనఁ దప్తులై యలుక మాన్పఁ దలంచియు, గుట్టుచేఁ జలిం
పక పవళించుదంపతులపాంగము లొక్కటఁ దారసిల్లి, దై
వికమున నవ్వుతోఁ గినుక వీడఁగఁ, గౌఁగిటఁ గూడిరిద్దఱున్ 21

చ॥ చెలులు ప్రియంబుఁ బల్కినను, జెల్వుని యాప్తులు బుజ్జగించినన్
దలఁకక సంజదాఁక నెడఁ దద్దయు నోర్చి, యతి ప్రయత్నతన్
నిలిపినయల్క యొక్కతఱి నెమ్మొగముల్ మరలంగ, నస్మితో
చ్చలిత విలోకసంఘటనఁ జయ్యన వీడఁగ నవ్విరిద్దఱున్ 37



## 22

ఇంక నాయకవాక్యాలు :– ధీరనాయికేర్ష్యాపూర్వక సంభోగమును నాయకుడు సఖునితో చెప్పుచున్నాడు.

చ॥ అలగియు నున్నఁ గాని, కలహంబొనరింపదు, నీవిఁ జేర్ప వే
నలిఁ గబళింప, దష్ట రదనచ్ఛదయై భ్రుకుటిం ఘటింప, దం
గలతిక యోరఁజేసి విముఖస్థితి నుండదు, కౌఁగిలింపఁగా
నెలఁతుక వింతగా నిపుడు నేర్చెఁజుమీ, యిటువంటి కోపమున్ 63

## 23

పూర్వానుభుక్తమైన ప్రౌఢనాయికభావమును నాయకుడు చెప్పుచున్నాడు.

చ॥ చనుఁగవమిట్టలం బులకజాలము పుట్టఁగఁజేఁయఁ గౌఁగిటన్
ఘనముగ నే బిగింపఁ, దమిఁ గ్రక్కున నీవిక జాఱ మానమో
చన యిఁకఁ జాలుఁ జాలు నను సన్నపుఁ బల్కులతోడ నిద్రవో
యెనొ సతి, మూర్ఛఁ జెందెనొ, లయించెనొ, డెందమునం గరంగెనో, 35

## 24

తన యపరాధంబెఱిగి కోపగించుకొన్న నాయికను నేర్పున మఱవ జేసిన నాయకుని వాక్యము.

ఉ॥ ఆ వగలాఁడి చన్నుఁగవ నంటిన గందముముద్ర రీవికిన్
దావగుపేరురంబుఁ చరణంబుల వ్రాలెదనంచు మాటు టే
లా వలదన్న నెక్కడిది? యంచిది మాటుట కేను గౌఁగిటన్
జేవ బిగింప, నా సుఖముచే మఱచెన్ సతి పూర్వవృత్తమున్ 24

## 25

ఏక శయ్యావిరహపూర్వకమైన సంభోగము నాయకుడు చెలికానితో చెప్పుచున్నాడు.

ఉ॥ ఏమని యెంచునో కువలయేక్షణ చూతమటంచుఁ, దాల్మి నే
నేమిఁ జలింపకున్న శరుఁడేలొకొ పల్కఁ డటంచు నల్గె, నా
కామిని యిట్లొకల్లొకరిఁ గన్గొనకుండెడుచో నెపంబునన్
నే మఱి నవ్వఁ గాంత హరియించె మనంబు దృగంబుధారలన్ 22

## 26

పూర్వానుభూతమైన ప్రవాసానంతర సంభోగశృంగారమును నాయకుడు తలపోస్తున్నాడు.

చ॥ అలకలు మీఱి, వాడి కృశమై, తెలుపెక్కి విలాస హీనమై,
యలసమునైన యింతిముఖమంతట నూరికిఁ బోయి నేను రాఁ,
దెలివియు, నుబ్బు, నబ్బురపుఁదీరును బూని, రతోత్సుకంబు నై
యలరఁగ వేడ్క నే నధర మానుట హా మఱవంగ వచ్చునే ! 62

## 27

ఇంక నాయికావాక్యాలు :- ధూర్తనాయకుడు చేసినవంచన సఖితో చెప్పుచున్నది.

ఉ॥ నేరముఁ జేసి వచ్చుపతి నే నటు పొమ్మనఁ బోయి, జోటి యా
కారముఁ బూనిరా భ్రమసి కౌఁగిటఁ గ్రమ్ముచుఁ గాంతుఁ గూర్చు, నే
ర్పారయుమన్న నవ్వి ముగుదా! యిది దుష్కరమంచు గ్రక్కునం
జేరిచె సెజ్జ నన్ను నిటు చేసినవంచనఁ గంటె నెచ్చెలీ ! 41

## 28

ధూర్తనాయకునిచేత వంచిత ముగ్ధనాయిక సఖితో జెప్పుచున్నది.

ఉ॥ ఎంతయు వింతసుద్ది గలదే, నెఱిఁగించెద నంచుఁ గాంతుఁడే
కాంతముఁ జేర్చె, నా కపట మారయ కే వినువేడ్క నుండ, న
త్యంతమునం గొఱుంగుచు నయంబునఁ జుంబన మాచరించి, తా
నంతనె కొప్పు దువ్వి చెలియా! యధరామృత మానెఁ గంటివే ! 66



## 29

ముగ్ధనాయిక స్వారబ్ధమైన శృంగారము.

ఉ॥ నిద్దురవోయి నీ ధవుఁడు, నీవును నిద్దుర పొమ్మటంచు, బోం
ట్లొద్దికఁ బల్కి పోనడవ నొందుచుఁ బ్రేమఁ దదాననంబు నే
ముద్దిడుకొన్నఁ, దత్పులకముల్ కపటస్థితిఁ దెల్ప, సిగ్గు చేఁ
దద్దయుఁ జెంద మాన్పెనది తత్సమయోచితలీలఁ గాంతుఁడున్ 32

## 30

అత్యంతానురాగమువలన నాయకుని యపరాధము దెలియమికి జెలులు దూరుదురో యని అళీక నాయిక భావము.

క॥ చెలి యెత్తి నట్టి కినుకన్
జెలువునిఁ బొమ్మన్నఁ గఠినచిత్తుఁడు చనియెన్
నిలుపఁగ నిలువక నిర్దయుఁ
డలుకను, దమి రేఁచి పోయె నతివరొ కంటే ! 14

## 31

ముగ్ధనాయిక రతిపారవశ్యము.

ఉ॥ పానుపుఁ జేరినంతఁ బతిప్రక్కను నీవిక జాఱె (వల్వయుం
దానట మేఖలాగుణధృతంబయి నిల్చె నితంబ మం దటన్)
మేనతఁ డంట, నాతఁడని, నేనని, యిట్టిది కేళి యంచు, నే
మైనను భేదమే యెఱుఁగ నంగన! యంగజు మాయ యెట్టిదో! 97

## 32

ఇంక సఖీ వాక్యాలు :- బంధవిశేషసూచన మైన పానుపు సఖులు చెప్పుట.

చ॥ ఒకయెడలఁ దమ్ములంపు రస, మొక్కెడ నాగురుపంకలాంఛనం
బొకయెడఁ, దావిగందవొడి యొక్కెడలం బదలాక్ష మించఁ, గై
శిక పతితావిశీర్ణ సుమచిహ్నితమై నులివడ్డ యానిచో
ళక వసనంబు దెల్పె, నవలా సవిలాస రతిప్రభేదముల్ 65

## 33

నాయకుని వద్దికి బోవుచున్న యభిసారికానాయికను జూచి చెలికత్తె ఉపాలంభిస్తున్నది.

ఉ॥ తళుకులు జల్లు హారములు దాల్చి కనన్మణిదీప్తమైన గం
టల మొలనూలు మ్రోయఁ జరణంబుల నందెలు ఘల్లు ఘల్లు నాఁ
జెలువుని యొద్ది కేగెదవు, చెంత డమామలు వాగఁ బోవు, లా
గులువిననేల, నల్దెసలుఁ గొంకుచుఁ జూడఁగ నీకు ముద్దియా ! 29

## 34

ఉ॥ ఎచ్చటి కేఁగెదే కువలయేక్షణ! యీనడురేయి; యిచ్చకున్
మచ్చికసేయు నా హృదయనాయకుఁడున్నెడ; కొంటి భీతిలే
కచ్చటికెట్లు వోయెదబలా! యిదె పుంఖితబాణుఁడైన యా
పచ్చని వింటిజోదడుగుఁ బాయక రా వెఱపేల నెచ్చెలీ! 68

## 35

అభిలాష విప్రలంభ ఖిన్న యైననాయిక చెలికత్తెతో ననేమాట.

ఉ॥ నమ్మఁగరాదు నెచ్చెలుల నాథుని పాలికి నంపఁ; బ్రేమ ధు
ర్యమ్మగుచూపుచేత హృదయజ్ఞుని నాతనిఁ జూడనీదు సి;
గ్గమ్మెయిఁ జూడ నింగితము నారసి లోకము నవ్వు; నెవ్వరో
యమ్మ! యిఁకన్ శరణ్యులని యాత్మను రాగమయాగ్ని డిందెడున్ 57

## 36

నాయిక అభిలాష విప్రలంభహేతువయిన చక్షుఃప్రీతిరూప ప్రథమావస్థను సఖి వర్ణిస్తున్నది.

చ॥ కని వినివృత్తమై మగుడఁ గాంచి ఘనప్రణయార్ద్ర మౌట నొ
య్యన ముకుళీకృతంబయి క్షణాభిముఖస్థితిఁ జెంది సిగ్గుచే
త నలగుచున్నిమేష రహితంబయి, హృద్గతభావమిట్టిదం
చు నెఱుక సేయు చూపుగమిఁ జూచెదవే ఘను బాల చెప్పుమా ! 5



## 37

ఇంకను ఈర్ష్యా విప్రలంభశృంగారము:– ప్రగల్భధీరయైన ఖండిత నాయికావ్యాపారము.

ఉ॥ కోమలబాహుపాశములఁ గోపమునన్ బిగియించి, కేలికా
ధామముఁ జేర్చి, నెచ్చెలులదగ్గఱఁ దొట్రిలుపేశలోక్తులన్
వేమఱు నిట్టె చేసెదని ప్రేయును దప్పుల నెత్తి పొడ్చుచున్
గామిని మానవంచకునిఁ గాంతునినవ్వెడువాని నేడ్చుచున్ 10

## 38

ముగ్ధనాయికయొక్క యీర్ష్యా విప్రలంభము.

చ॥ చెలువుఁడు క్రొత్తగా మొదలఁ జేసిన నేరమెఱింగి గోల నె
చ్చెలు లుపదేశమియ్యఁగను జిక్కగ వ్యంగ్యపు మాటలాడఁగాఁ
దెలియదు గాన మోము వడిఁ ద్రిప్పుచు ముంగురు లచ్చగండపా
ళుల నలయంగ నశ్రువుల లోలతరాక్షుల నించె ధారగన్ 27

## 39

ముగ్ధనాయిక యీర్ష్యాకృతకోపరూప భావశాంతి ప్రకారము.

చ॥ పలుకవదేటికే మధురభాషిణి ! పాదగతుండనైన నన్
గలయఁగఁ జూడవే మునుపు గంటినటే యిటువంటి యల్క యం
చలరమణుండు వేఁడుకొన నడ్డముగా నరగంటఁ జూచి య
గ్గలముగ బాష్పముల్ కురిసెఁగాని వధూమణి పల్కదేమియున్ 34

## 40

ధీరఖండితానాయికాభావము.

చ॥ తరుణుఁడు నేరముల్ సలిపి దవ్వుల రాఁ గనఁగోరెఁ జేరినన్
మరలిచెఁ జూపు బల్కఁగఁ గనంబడె విప్పటు గౌఁగిలింపఁగా
నరుణిమఁ జెందెఁ గొంగు దివియన్ బొమలెక్కిడె మ్రొక్క నశ్రువుల్
గురిసె క్షణంబులో రమణి లోచనయుగ్మము చిత్రపాత్రమై 44

**41**

మధ్యధీరాధీర నాయికా భావము.

చ॥ చెలువుఁడు మిక్కిలిం దడవుసేసి యెఱుంగని వాఁడ పోలె నో
కలికి! కృశించె మేను వణఁకన్ గతమేమి? యదేల చెక్కులున్
బలకగఁ బాఱె నా, నిది స్వభావము నాకని మోముఁద్రిప్పి, తొ
య్యలి యుసురంచు నించెఁ దొలకాడెడు ఱెప్పలనాను బాష్పముల్ 45

**42**

చతురులయిన నాయికా నాయకులయొక్క గురుసన్నిధి గూఢముగా
నైన అపరాధ సూచన కోపానునయ ప్రసాదాభావము.

చ॥ సవతిగృహంబు సూప సతి సన్నలనే తల యూఁచెఁగాంతుఁడా
ధవుడెఱిఁగించినట్టి సతిధామమెఱింగియు విన్ననయ్యె భ
ర్త వదన మెట్టుసేయ వనితామణి కన్నులమ్రొక్కె నాథుఁడి
ట్లు వదలరైరి వారువెగటుల్ గురుసన్నిధినైనఁ జేష్టలన్ 69

**43**

అధీరనాయిక యీర్ష్యావిప్రలంభము.

ఉ॥ ఇంతి విచారమానమున నేమియుఁ జూడక బద్ధమౌనయై
కాంతు పదప్రణామమును గైకొనకుండెఁ బరాఙ్ముఖంబుతో
నంత నతండె పోఁదివుర నాఁగె నపార సబాష్పసంతతా
క్రాంతవిలోకసంతతులఁ గాతరలీలఁ దదంతరంబునన్ 64

**44**

ఖండితధీరనాయికాభావము.

చ॥ అలికమునందు లాక్ష మెడ, నందపు ముద్రిక మోవిమీఁదఁ, గ
జ్జలమును దమ్ములంపురవ జాగర రాగము కన్నులం దగన్,
జెలువుఁడు రాఁగ ఱేపకడఁ జెల్వ గనుంగొని నించెఁ గిన్కతోఁ
దలముగఁ గేలఁ గేళినలినంబును మూర్కొనుపేర నూర్పులన్ 71



**45**

ఖండితనాయికాకోప ప్రసాదసంధి.

ఉ॥ నేరము సేసియుం, దనదు నేరము లేదని మ్రొక్కి వే పదాం
భోరుహపాళి వ్రాలుప్రియుఁ బోలదు, నేరము లెన్నఁగాదు, లే
దారయ నల్క నీ కని ప్రియాళులు సెప్పినఁ గోపవేగ మిం
తారఁగ మున్న పుట్టెను, దృగంబువులచ్చుపడంగ నింతికిన్ 75

**46**

ప్రౌఢధీరనాయికాభావము.

చ॥ ఇలు సొర నడ్డగింప దొకయింతయు, ముందఱ నిల్వదింత, య
వ్వలిమొగమైనఁ గాదు కటువాక్యములైనను బల్క దల్కచే,
నలికులనీలవేణి సరళాంచితపక్ష్మవిలోకనంబులన్
జెలువునిఁ జూచు నూరక యశేషజనంబులఁ జూచు కైవడిన్ 99

**47**

ప్రౌఢ ధీరాధీరనాయిక సాపరాధుడైన నాయకుని పరుషవాక్యాలు
లేకే నేర్పున నలయించుట.

మ॥ ఒకచో నుండుట మాన్పె, దూరమునఁ బ్రత్యుత్థానముం జేయుపో
లికఁ దాంబూలముఁ దెచ్చుపేర రభసాశ్లేషంబు దూలించె, బోం
ట్లకు వే యూడిగముల్ ఘటించుగతి మాటల్మానె, నిట్లల్క రూ
ఢికిఁ దెచ్చెన్వినయంబుఁ జేయుగతి సూటిన్ బోటి కాంతాగతిన్ 17

**48**

ఇంకను ఈర్ష్యాసంభోగనాయికా వాక్యాలు :– ప్రౌఢధీరనాయిక
భావము.

ఉ॥ మ్రొక్కఁగ వచ్చు నీతఁ డని, మున్ గని యంఘ్రులు మూయఁ గోకచేఁ
బక్కున నవ్వ, దా నొక నెపంబునఁ గప్పు ప్రియోక్తు లాడ, నా
దిక్కటు చూడకే చెలుల దిక్కయి ముచ్చట లాడుచుండు నా
చక్కెరబొమ్మ! ప్రేమ కడుఁ జక్కన పో పొలయల్క నెచ్చెలీ ! 42

## 49

ఈర్ష్యాకలుషిత తిరస్కృతుండైన నాయకుండు నాయిక సౌందర్యమును దలంచుకొని ఖేదమున ననేమాట.

ఉ॥ బాలిక యీపె; మా కొదవెఁ బల్కులఁ గొం; కదిభీరు; మాయెదన్
వాలెదు భీతి; యున్నతఘనస్తన యాపె; శ్రమంబు మాకు; ను
ద్వేలనితంబ యా జలదవేణి; చలింపఁగలేము మేము; హా
యాలలితాంగి దోషముల నబ్బుర మేమటు లౌట కారయన్ 102

## 50

మధ్యమధీరాధీరనాయిక యొక్క ప్రసాదపర్యవసాయి యైన యీర్ష్యా విప్రలంభము.

చ॥ చలము మఱేయుపాయముల జాఱక, నేఁ జరణాబ్జపాళి ని
చ్చలముగ వ్రాలినంతటన, జాఱినఁ జెక్కిటఁ జేయిఁ జేర్చి, యీ
కలికి నిజప్రసాదము ప్రకాశముగా నెఱిఁగించెఁ బక్ష్మని
శ్చలధృతముక్త కర్కశ కుచస్థల కర్ణదృగంబుధారలన్ 55

## 51

ప్రగల్భధీరనాయికను అనునయించే కొఱకు.

చ॥ దరహసితంబు తోడ దవుదవ్వుల నిట్లెదురేఁగుదెంచినన్
శిరసున నాజ్ఞఁగైకొనిన నేఁ బలికించిన మాఱు పల్కినన్
దిరముగ నీ చలంబుఁ గని నిష్ఠురతాత్త నిగూఢ కోపపుం
జ రచిత కృత్యమే యిది నిజంబనిన నా మదిఁ దాపమొందెదున్ 56

## 52

నాయకుఁడు కుపితయైన నాయికను చతురవచనాలచేత ననునయిస్తు న్నాఁడు.



చ॥ చెదరఁగఁ జేసెఁ బత్రములఁ జెక్కిటఁ జేర్చినకేలుదమ్మి యిం
పొదవు రదచ్ఛదామృతము నూరుపుఁ దెమ్మెర లానె బాష్పముల్
కదలఁగఁ జేసెఁ జన్నుఁగవ కంఠనిరుద్ధము లౌట నైనకి
న్క దయితుడా! మాయె నీకు, నటు గామిటు మే మనువృత్తిఁ జేసియున్85

## 53

ప్రగల్భ ధీరాధీర ఖండితనాయిక సాపరాధుఁడైన నాయకునిఁ గూర్చి పలుకుచున్నది.

ఉ॥ నేరముఁ జేసి లేదనెదు నీవును, నట్లగుఁ గాక నేము, ము
న్నారసినట్టివే యివి, వృథాలపనంబుల నేమి కార్య? మే
నేరము లేదు పొమ్ము, విధి నిక్కము వక్రము, నాకు నట్టి నీ
కూరిమి యిట్టులైన నిఁకఁ గుచ్ఛితజీవనమేల కోరఁగన్? 28

## 54

ప్రగల్భధీరాధీరనాయిక సాపరాధుఁ డైన నాయకుని సాభిప్రాయముగ వక్రోక్తులచేతఁ బలుకుచున్నది.

చ॥ కినుక యటన్న బొమ్మముడి, కేవలమౌ కలహంబు మౌనమే,
యనునయమెల్ల నవ్వుటయ, యల్కలు దీరుట మోముచూచుటల్,
మనమరియాద; యిప్పటిక్రమంబును గంటివె పాదపీఠిచెం
తనె పొరలాడె దీ వలుక తాళదు దంటకు నాకు నేమియున్ 33

## 55

నాయకునియొక్క యపరాధాతిశయోక్తిచేత నీర్ష్యాపరాకాష్ఠను బొందిన నాయికను గోపము మానుమని సఖులంటే నాయికపేరలుక ననేమాట.

చ॥ నెలఁతుక కాంతుతో నలుగ నేఁడుమొదల్ శఠుఁడై విషాకృతిన్
మెలఁగెడు వానిపేరయిన నే నొడువన్ మఱి యిట్టు లాతనిన్
గలయక వేగు నాకు నిఁకఁ గల్గదె శారదచంద్రచంద్రికో
జ్జ్వలయగు రాత్రియైన ఘనసంవృతమౌదినమైనఁ గారునన్ 72

### 56

సాపరాధుఁడైన నాయకుఁడు వినోదచేష్టలచేతనే తన యపరాధమును మఱవఁజేసెద నని రాఁగాను మధ్యమధీరాధీరనాయిక అనేమాట.

చ॥ కుటిలపు నీదుచేఁతలకుఁ గుంది, పరాకున నుండ, వెన్కనే
కటకట యిట్లు వచ్చి ననుఁ గౌఁగిటఁ జేర్పఁగ, వల్లభాకుచో
త్కటనవకుంకుమాంక సుభగంబగు నీ యెద వేణి తైలసం
ఘటన మలీమసంబగుట కాక ప్రయోజనమేమి చెప్పుమా! 16

### 57

ప్రగల్భధీరాధీరనాయిక శఠనాయకుని దూరుచున్నది.

చ॥ అల సతి కాంచిమ్రోఁత వినినంతనె నన్నెదఁ గౌఁగిలింపుచున్
జలమతి జాఱు నీ శఠవిచారము లెక్కడఁ జెప్పుదున్ ఘృతో
జ్జ్వలమధుతుల్యతావక వచః క్రమమోహితచిత్త యౌచు నె
చ్చెలి యటు చేసె నా పలుకుఁ జేకొన, కేనును మోసపోయితిన్ 73

### 58

నాయకునిఁ బిలువఁబోయి సురతచిహ్నలతో వచ్చినదూతిని నాయిక వ్యాజముచేత నపరాధము తోఁచేటట్టుగా దూఱుచున్నది.

చ॥ స్తనతటి గంధమంతయును జాఱెఁగడుం, బరిమృష్టరాగ మా
యె నధరమక్షికోణముల నెంతయుఁ గాటుక లేదు, డస్సిమే
నును బులకించె, నిట్లు చెలి నొప్పి యెఱుంగక బావిఁ గ్రుంకిడన్
జనితివి దూతి! యా విభుని సన్నిధి కేఁగ నసత్యవాదినీ ! 61

### 59

మధ్యమధీరనాయిక నాయకుఁడల్పాపరాధం చేసినను మిక్కిలి సాహసురాలౌటను అలవోక చేసినదె నాయకుఁడు చేసినదిగాను ఆరోపించి దూఱుట.



చ॥ మనకుఁ దను ప్రభేదమనుమాటయె లేదట తొల్లి, యాపయిన్
దనరితి వీవు ప్రేయసుఁ డనన్ మఱి ప్రేయసి నైతి భాగ్యహీ
నన నగుట నేను నిప్పుడయినన్ బతి వీవును నేను నాల నే
మన నిది వజ్రకర్కశతఁ బ్రాణము నిల్పుటకున్ ఫలంబువో! 81

### 60

బాల్యమందుఁ బరిచయముచేసి వెనుక అల్కచేసిస్వేచ్ఛను ఒకప్పుడు వచ్చిన నాయకుణ్ణి నాయక దూఱుచున్నది.

ఉ॥ నాయెదఁ బుట్టి చన్నులు ఘనంబులు నీయెద నయ్యె, మాటలున్
నీయనులాపసంగతిని నేరిచెఁ బ్రౌఢిమ, దాది కంఠమున్
బాయుచు నీదు కంఠమునఁ బైకొనె బాహువు, లట్టి నీకు గా
దాయె మదీయ రథ్య దెరువైనను నిర్దయ యేమి సేయుదున్ 87

### 61

నాయకునిఁ బొందినదూతియొక్కాను నాయిక యొక్కాను ఉత్తర ప్రత్యుత్తరాలు.

ఉ॥ ఏల చెమర్చె మోము చెలి? యెండ; కనుంగవకెంపు? వాని వా
చాలత నైనకిన్క; కచసంతతిఁ జిక్కొ? సమీరణంబుచే
రాలిన దేమి కుంకుమము? రాపడి పైఁట; శ్రమంబొ? త్రిప్పటన్
బోలు నిదెల్ల; గంటి నునుమోవికి రాఁ గతమేమి చెప్పుమా! 93

### 62

ఇంక సఖీవాక్యాలు :- సాపరాధుఁడై యింటికి వచ్చిన నాయకునిఁ దిరస్కరించిన నాయికతో నాయకానుకూలమైన సఖి పల్కుచున్నది.

చ॥ అవనతి నేల వ్రాయుచు గృహాంగణసీమన యున్నవాఁడు ప్రా
ణవిభుఁడు సంతతాశ్రునయనంబులతోడ విముక్తభుక్తులై
రి వగల నెచ్చెలుల్ పలుకరింపవు కిల్కిలఁ జిల్క లీవు ని
ట్లవశత నున్నదాన వహహా! కఠినా! విడుమింకఁ గోపమున్ 8

## 63

సఖి నాయికను బెదరించుట.

చ॥ కనుఁగవ నీరు గోటికొనఁ గ్రమ్మఱఁగ్రమ్మఱఁ జిమ్మి యుస్సురం
చనయముఁ గుంద నేల యెడ నాడెడు మాటలఁ గోపశీల నీ
కినుకయు హెచ్చ హెచ్చఁ బలికించు ప్రియంబులు వల్కు(చుండు)వాఁ
డు నలసి యూరకుండినఁ గడున్మనకార్యము చప్పనౌఁ జుమీ! 6

## 64

ఈర్ష్యా విప్రలంభకలుషితురాలైన నాయికను గూర్చి నాయకునికి లోనైనసఖి దూఱుచున్నది.

చ॥ ముగుదలపోలె లో కపటముల్ పచరించి సపత్నులెంతయున్
మగని వశంబు చేసికొన మాన్పఁగ శక్యమె వారి కింపుగా
వగచుచుఁ గంతుకేళిరతు వల్లభుఁ బ్రాయపువాని సన్నిధిన్
బగటులు వల్కనేల మృదుభాషల వశ్యునిఁ జేయు నెచ్చెలీ! 9

## 65,66

సాపరాధుఁడైన నాయకుని మీఁద నాయిక కోపముతో నుండఁగాను నాయికకుఁ దెల్పుమని నాయకుఁ డంటేను, నాయికమీఁదవేసరి నెపముగాను చెలికత్తియ నేర్పునను నాయకునిమీఁదనే అపరాధం దోచేటట్టుగాఁ బలుకుచున్నది.

చ॥ చనవటు నీవ యిచ్చితివి చామకు మన్ననఁ జేసి తిన్ని నా
ళ్లను నవమైన విప్రియములున్ సవరించితి విప్రియంబుచే
త నడఁపరానికోపమునఁ దాళవు సాంత్వనముల్ నృశంస ! య
ల్క నిలుచునంతదాఁక రొద నా చెలి యేడుచుఁగాత దీనతన్ 7

మ॥ కలరే జవ్వను లింట నింటఁ బురి నేకాంతుండు నీ కాంతుఁడుం
బలె దాసాకృతిఁ గాంతకుఁ బ్రణతుఁ డౌ భావమ్ము దాఁ గల్గినన్
దెలియన్ రాదె పరోక్తులన్ వినికటా నిక్కంపుటాత్మేశు నీ
వలయంజేసిన నాత్మవంచనధురీణా! యాతఁడున్ వేసరున్ 59



## 67

ప్రవాస విప్రలంభ వాక్యాలు :– నాయకుని ప్రవాస విప్రలంభమును.

చ॥ ఒక పథికుండు రాత్రి సజలోదరమేదుర మేఘగర్జ లో
ర్వక కనుదోయి నశ్రువులు రాలఁగ నాత్మవియోగదుఃఖ సూ
చకమగుపాట పాడ విని జంపతు లల్గుట వింతయే ప్రవా
సకథకుఁ గూర్మి యల్కలను సైతము నుజ్జన చేసిరాత్మలన్ 46

## 68

ప్రవాసోన్ముఖుఁడైన నాయకుని ముగ్ధనాయిక నిల్పినభావము.

చ॥ ఘనఘనజాలకాలమగు కాలమునన్ శకుఁడూరి కేఁగ జో
టి నిలువుమంచుఁ బల్కదు ఘటింపదు చేలపటాంత మడ్డమై
చనదట ద్వారభూమికిని సారెఁ బదంబుల వ్రాల దశ్రుసం
జనితనదీజలౌఘములసంగతి చేతనె నిల్పె యానమున్ 53

## 69

ప్రవాసగతుఁడైన నాయకుని భావము.

చ॥ జనపద నిమ్నగాద్రి వనసంఘ తిరోహిత యౌటఁ గానరా
దనయము నెట్టి యత్నములనైనను గాంత యటంచెఱింగి యు
న్నను మెడ యెత్తి నిక్కి నయనచ్యుత తోయముఁ గేలఁ ద్రోయుచున్
గనుఁగొనుఁ బాంథుఁ డాదెసయె క్రమ్మఱఁ జింతతోడుతన్ 92

## 70

నాయిక ప్రయాణోన్ముఖుఁ డైన నాయకుణ్ణి ముగ్ధాలాపాలచే నిలుపుట.

ఉ॥ జామున నేఁగుదెంచెదొ నిజంబుగ రెండవజాము దీఱఁ గా
నో మఱి మీఁదియామముననో దివసాంతమునందొ కాక యం
చీ మెయిఁ బెక్కునాళులకు నేఁగెడు దేశము వోవు నాథునిన్
భామిని బాష్పముల్ దొరుగఁ బల్కుచు నే పయనంబు మానిచెన్ 13

## 71

నాయకుని వాక్యాలు :– ఊరికిఁ బోఁ బయనమై మానిన నాయకునిని చెలికాఁడు అడిగితే నాయకుఁడు తెల్పుచున్నాఁడు.

ఉ॥ ఊరికిఁ బోవువారు మఱియున్ జనుదేరొకొ మేళగింపరో
హో రమణీ! కృశించితివె యంచుఁ దృగంబువు లొల్కఁ బల్క నే
నా రుచిరాంగి లజ్జ దొలఁకాడెడు కన్నులనశ్రులాఁగిన
న్నారసి శుష్కహాసమునఁబ్రాణములొల్లమిఁదెల్పె నెచ్చెలీ! 11

## 72

నాయకుఁడు దేశాంతరగతుఁడై పూర్వానుభూతమైన మదిరామద కలుషితనాయికా భ్రమపూర్వకేర్ష్యా విప్రలంభము.

ఉ॥ అంగన తాను జేసిన నఖాంకురమే తలపోయఁగాఁ, బరా
సంగతి నైనదంచలిగి సయ్యనఁ బో, నెటు పోయెదంచు నేఁ
గొం గొడియంగ, వే మరలి, కోపముచే విడుమంచు, నశ్రు లొ
ల్కం గనుదోయి మోవి గదలన్ ననుఁ బల్కుట కోర్వవచ్చునే ! 47

## 73

విదేశగతుఁడైన నాయకుఁడు ప్రవాసవిప్రలంభారంభమందలి నాయికా భావమును దలఁచి ఖేదపడుట.

ఉ॥ కాంత ఘనోదయంబు దివిఁ గన్గొని యశ్రువులొల్క దవ్వగాఁ
గాంతుఁడ! వోయెదేని యని గద్గదికన్ సగమంచు నాదు చే
లాంతముఁబట్టి నేలఁజరణాంగుళి వ్రాయుచుఁ జేయు దక్షిణా
నంతరభావసంగతులు హో వచియింపఁగ శక్యమా చెలీ! 49

## 74

ప్రవాసగతుఁడైన నాయకుఁడు వసంతకాలమందు నాయికకు సంభావితమైన యవస్థ నూహింపుచున్నాఁడు.



ఉ॥ అంగదఁ గేళికాసరసియందున నున్న సరోరుహోచ్చల
ద్భృంగమనోజ్ఞమంజరి ధరించి కరంబునఁ బైఁటకొంగుచే
నంగముఁ గప్పి కంఠనినదాతి నిరోధముచేత నూర్పులు
త్తుంగకుచంబులుం గదలఁ దొయ్యలి యేడ్చునటంచు నెన్నెదన్ 83

## 75

ఇంక నాయికావాక్యాలు :– ప్రవాసోన్ముఖుఁ డైన నాయకునితోను ప్రగల్భధీరాధీరనాయిక అనే యుక్తి.

చ॥ నయనపయోఝరంబులఁ బ్రణామములన్ శపథంబులన్ మఱిన్
బ్రియముల దీనశీల కబరీహతిమానుపు నూరి కేఁగుచోఁ
బ్రియు నటు సేయనే జనుము రేపుదయంబనురాగ సమ్మతం
బయినమదీయచర్చ విన నౌనిదె త్రోవన నీకు వల్లభా! 52

## 76

ప్రవాసవిప్రలంభఖేదము నోర్వలేక నాయిక అనే మాట.

మ॥ దయితుండూరికిఁబోవ, నాయితపడం దాఁ దోడనే జాఱెఁ దా
బ్రియమౌ కంకణపాళి యశ్రువులు, నెంతేఁ బాయకేఁగెన్ క్షణం
బయినన్ నిల్వదు ధైర్య ముల్లమున, నాయత్తంబు మున్మున్న బోఁ
బ్రియులెల్లన్ జన నిట్లు జీవితము వారిం బాయఁగా నాయమే? 31

## 77

ప్రోషితభర్తృక యైన నాయిక అనురాగోద్దీపకమైన మేఘమును జూచి అనేమాట.

చ॥ మలయసమీరవారములు మావియక్రొన్ననకమ్మఁదావి పెం
పలరెడుగ్రీష్మముల్ సనియె నయ్యవి నాథునిఁ గూర్పలేక నీ
కలవడెనేనిఁ గూర్పు ఘనమా! వినుమా చను మాదరంబుతో
నిలఁబసులన్ మరల్పఁ గలఁ డెవ్వఁడు వాఁడె ధనంజయుండనన్

**78**

ఇంక విరహవిప్రలంభ వాక్యాలు :- సఖీబోధనవలనను నాయకునిఁ దిరస్కరించి పశ్చాత్తాపమును బొందిన నాయికావృత్తాంతము.

చ॥ పదముల వ్రాలియున్నపతిఁ బాయఁగఁ ద్రోచిన, గూఢకైతవా
స్పద యని పల్క, నాతఁడును బ్రార్థన సేయక కిన్కఁ బోవ, నా
ముదితయు నుస్సురంచుఁ గరము న్గచపాళికిఁ జేర్చి చూచెఁదన్
బదరుమటన్న నెచ్చెలుల బాష్పసమాకులదీనదృష్టులన్ 19

**79**

ప్రణయకోపవ్యాజముచేతను నాయికాంతరమును గూర్చి పోయే నాయకుని నడ్డగించుకొనే అధీరనాయికా వ్యాపారము.

చ॥ అలుక నెపంబు సేసి ప్రియుఁ డవ్వలఁ బోవఁగ, దీనదృష్టిచే
నలికచమాచి వేడుకొన, నంజలి సేయుచుఁ గొంగుఁ బట్టియున్
నిలిపె నిమిత్త మారయక, నిండుకవుంగిటఁ జేర్చి యిన్నియుం
దలఁపక యల్కపో విడిచె నాతి జిజీవిష మున్నుగాఁ బ్రియున్ 70

**80**

అమితధైర్యయైన అధీర నాయికావిప్రలంభము.

చ॥ ఘనవిరహార్తి ప్రక్క లగుఁగాక మనంబు కృశంబు సేయుఁగా
కనయము మే ననంగుఁడు మహాచపలుండగుకాంతుచేతనే
పని యిఁక బోటి యంచలుకఁ బల్కుచు నంత కురంగశాబలో
చన పతి వచ్చుమార్గము నశంకితయై పరికించెఁ బల్మఱున్ 79

**81**

విరహోత్కంఠితాభావము.

చ॥ చెలువుఁడు వచ్చువేళ, సరసీరుహమిత్రుఁడు క్రుంకుదాఁకఁ జూ
చి, లలన యంతటంతటను జీఁకటి గ్రమ్మి పదప్రచారముల్
నిలువఁగ నింటికిం జనఁగ, నెవ్వగ నొక్కపదంబు వెట్టి లో
పల మరలంగఁ గన్గొనియెఁ, బ్రాణవిభుం దరుదెంచునన్మతిన్ 91



**82**

కలహాంతరిత యైన యధీరనాయికా వృత్తాంతము.

చ॥ అలగి యెటేనిఁ బోఁ దలిమ, మల్లనఁ జేర్చినకాంతుఁ డంత న
న్యలలనపేరఁ బిల్వ, విరహాసహతన్ వినలేని భావనన్
మెలఁగి నిజావమానము క్షమింపని బోఁటులు విందురోయటం
చలుకుచు నెల్లచోటరసి యంగన రంజిలె వారిలేమికిన్ 76

**83**

ఇంక విరహవిప్రలంభ సఖీవాక్యాలు :- విరహోత్కంఠావృత్తాంతము నాయకునకు సఖి దెలుపుట.

చ॥ విరహము వేచె నంచుఁ దఱి వేచి తనూలత దయ్యఁజేయఁగా
మరుఁడు విధాతృఁడుం గరుణ మాలి దినంబులుఁ లెక్కవెట్టఁగాఁ
దరుణి చలంబులోఁ గలిసి ధైర్యము నీవును బూని యుండఁగా
హరి!హరి! చూడుమా కిసలయాధరకేగతి నిల్చుఁ బ్రాణముల్ 82

**84**

ఇంక విరహనాయికా వాక్యము :- మానకరణానకు సఖులు బోధించితే నాయకునియందు గల అనురాగాతిశయమున్నూ అందున తనకు మానకరణమందు అసామర్థ్యమున్నూ, భయానుభావచేష్టా వచనాదులను ప్రకటించుట.

చ॥ ముగుద యిటెల్ల కాలమును ముగ్ధతచేఁ గడపంగ నేటికిన్
మగనియెడం జలం బునుపు మాను ఋజుత్వము పూనుధైర్యమం
చగడుగ బోఁటి దెల్ప హృదయస్థుఁడు ప్రాణవిభుండు విన్నఁ ద
ప్పగుఁ జెలి యొయ్యఁ బల్కుమని యాడె సఖిన్ సఖి భీతవక్త్రయై 82

**85**

సఖీబోధనచేతఁ గలహాంతరితయైన నాయిక చెలులతో ననేమాట.

ఉ॥ ఊరుపు వెట్టఁ గంటి మొగముల్లము పెల్లగిలంగ నిద్రరా
దారసి కాంతు మోముఁగన నశ్రుఝరంబెడఁబాయ దెప్పుడొ
ప్పారెడు మేను డస్సెఁ జరణానతు నాథునిఁ ద్రోచి యల్లఁగాఁ
జేరెడు నేఫలంబనుచుఁ జేసితి బోధనలిట్లు నెచ్చెలీ! 98

**86,87**

ఆరోపితేర్ష్యా పూర్వక విప్రలంభము. నాయకుని యందు అత్యంతాను రాగముగల నాయిక సఖులచేత మానకరణంకొఱకు బోధింపబడ్డదై దాక్షిణ్యంచేతను వారినేమియు ననలేక తనకు మానకరణమందు అసామర్థ్యమును దెలుపునది.

చ॥ అతను మొగంబుఁజూడ మొగమల్లన వంచితిఁ,జూపులంఘ్రిచే
ర్చితి, నతఁ డాడుమాటలు గుఱించి వినం దమకించు వీను లాఁ
గితిఁ, దగఁ గేలుదోయి పులకించుఁ జెమర్చుఁ గపోలపాళి మూ
సితిఁ జెలులార! యీ రవిక చీఱెడు నుబ్బున నేమిసేయుదున్ 12

చ॥ బొమముడి వెట్టినన్ నయము బో, తమిఁజూడఁగ మానమెంత మా
నముఁ గయికొన్న నుండదిదె, నవ్వక యాచలపాది మోహధై
ర్యము మదిలోనసున్నిలువ దంగము, దా గరుపాఱకెట్లు మా
నము నిలుపోవ శక్యమగు నాకుఁబ్రియుం గనుఁగొన్న నెచ్చెలీ! 26

**88,89**

మానకరణమందు సారస్యం కద్దని బోధించిన సఖులతో నాయిక అనేమాట.

ఉ॥ ఎవ్వనిమాట విన్నఁదనువెంతయునుం బులకాంకురాంకమౌ
నెవ్వని యాననంబుఁగన హెచ్చు చెమర్చు విధూపలాభయై
యవ్వగలాఁడు తాన బిగియారఁ గవుంగిటఁ జేర్పవచ్చుచో
నెవ్విధి నిల్చుఁ బ్రాణము సఖీ! మఱి వజ్రసమంబు చేసినన్ 58



చ॥ పలుమఱు చేర్చితిన్ భ్రుకుటి బ్రాపడఁజేసితి నర్ధమీలనం
బలవడె నవ్వఁడంచు విధమాగతి శిక్షత మాయెమౌనమున్
నిలిపితి ధైర్యమున్ చెలిమి నెమ్మది మానము నిల్పు యత్నముల్
బలువుగఁగల్గె నీగతి ఫలంబిఁక దైవమెఱుంగు నెచ్చెలీ! 95

**90**

మానకరణమందు సారస్యం కద్దని బోధించిన సఖులతో నాయిక అనేమాట.

చ॥ పతి పదపాళి వ్రాలి ప్రియభాషలవేఁడుట, కార్శ్య మొందియు
న్న తనువు బల్మి కౌఁగిటఁ బెనంచుట, ముద్దిడుకొంటయున్, ఫల
ప్రతతి యొసంగు మానపరిపాలన, నైనను నట్ల సేయనే
నతిహృదయప్రియుండగుట నాతఁడు నెచ్చెలి యేమి సేయుదున్ 96

**91**

నాయికాపాదతాడితుండైన నాయకుఁడు మదనదేవునకుఁ బ్రియుఁడని కావ్యాంతమందుఁ గవీశ్వరుఁడు మంగళాచరణమును చేస్తున్నాఁడు.

ఉ॥ యావరసార్ద్రమున్ గిసలయారుణకోమలమున్ వినూత్నర
త్నావళి నూపురంబును మదాలసభావము నొపదంబుచే
నే వరపూరుషుండు ప్రణయేర్ష్యఁబ్రియాంగనచేతఁ దాడితుం
డై విలసిల్లు వాఁడు కుసుమాయుధ దేవునకుం బ్రియుండగున్ 101

కం॥ ఇలఁ దాళ్ళపాక సత్కుల
తిలక శ్రీ వేంకటేశ దీక్షితసుతుఁ డు
జ్జ్వలకవితానిధి తిరువెం
గళప్ప యమరుకము తెనుఁగుగా విరచించెన్ 93

కం॥ క్షితిపై నా చంద్రార్క
స్థితి మించఁగఁ దాళ్లపాక తిరువేంగళదీ
క్షితుఁ డమరుకమున్ వేంకట
పతికి సమర్పణముగాగఁ బరువడిఁ జేసెన్ 94

| సం | తె | సం. | తె | సం. | తె |
|---|---|---|---|---|---|
| 1 | – | 26 | 87 | 51 | 8 |
| 2 | – | 27 | 38 | 52 | 5 |
| 3 | 1 | 28 | 53 | 53 | 68 |
| 4 | 2 | 29 | 33 | 54 | 83 |
| 5 | 36 | 30 | – | 55 | 50 |
| 6 | 63 | 31 | 76 | 56 | 51 |
| 7 | 65 | 32 | 29 | 57 | 35 |
| 8 | 62 | 33 | 54 | 58 | 88 |
| 9 | 64 | 34 | 39 | 59 | 66 |
| 10 | 37 | 35 | 23 | 60 | 10 |
| 11 | 71 | 36 | 7 | 61 | 58 |
| 12 | 86 | 37 | 21 | 62 | 26 |
| 13 | 70 | 38 | – | 63 | 22 |
| 14 | 30 | 39 | – | 64 | 43 |
| 15 | 3 | 40 | 16 | 65 | 32 |
| 16 | 56 | 41 | 27 | 66 | 28 |
| 17 | 47 | 42 | 48 | 67 | 4 |
| 18 | 5 | 43 | 17 | 68 | 34 |
| 19 | 78 | 44 | 40 | 69 | 42 |
| 20 | 6 | 45 | 41 | 70 | 79 |
| 21 | 20 | 46 | 67 | 71 | 44 |
| 22 | 25 | 47 | 72 | 72 | 55 |
| 23 | 18 | 48 | – | 73 | 57 |
| 24 | 24 | 49 | 73 | 74 | 11 |
| 25 | 9 | 50 | – | 75 | 45 |



| సం | తె | సం. | తె | సం. | తె |
|---|---|---|---|---|---|
| 76 | 82 | 85 | 52 | 94 | – |
| 77 | – | 86 | 14 | 95 | 89 |
| 78 | – | 87 | 60 | 96 | 90 |
| 79 | 8 | 88 | – | 97 | 31 |
| 80 | 15 | 89 | 2 | 98 | 85 |
| 81 | 59 | 90 | 3 | 99 | 46 |
| 82 | 84 | 91 | 81 | 100 | 19 |
| 83 | 74 | 92 | 69 | 101 | 91 |
| 84 | – | 93 | 61 | 102 | 49 |

## శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం ద్వారా ప్రచురింపబడిన గ్రంథములు

| | | |
|---|---|---|
| 1. | తెలుగుమెఱుగులు | 2008 |
| 2. | కావ్యమంజరి | 2008 |
| 3. | అన్నమాచార్యచరిత్రపీఠిక | 2008 |
| 4. | సింహావలోకనము | 2009 |
| 5. | పూలవిందు | 2010 |
| 6. | ప్రజ్ఞాప్రభాకరము–గురుపూజ | 2011 |
| 7. | వేటూరిప్రభాకరశాస్త్రి వాఙ్మయసూచిక | 2012 |
| 8. | కేయూరబాహుచరిత్ర | 2012 |
| 9. | శ్రీ వేంకటేశ్వర స్తుతిరత్నమాల | 2013 |
| 10. | వేటూరివారి పీఠికలు మొదటిభాగం | 2013 |
| 11. | వేటూరివారి పీఠికలు రెండవభాగం | 2013 |
| 12. | చాటుపద్యమణిమంజరి 1వ భాగము. | 2013 |
| 13. | చాటుపద్యమణిమంజరి 2వ భాగము. | 2013 |
| 14. | సుభద్రా కళ్యాణము | 2013 |
| 15. | సుగ్రీవ విజయము. | 2013 |
| 16. | బసవపురాణము (బసవోదాహరణమును అనుబంధంగా) | 2013 |
| 17. | శ్రీ వేంకటేశ్వర లఘుకృతులు. | 2013 |
| 18. | శ్రీ వేంకటేశ్వర వచనములు. | 2013 |
| 19. | ఆంధ్రకామందకము. | 2013 |